క్లుప్తంగా

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలి

వైఎస్సార్ సీపీ సమన్వయకర్త బలసాని



గుంటూరు రూరల్: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ సత్తా చూపేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త సిద్ధంగా ఉండాలని వైఎస్సార్ సీపీ ప్రత్తిపాడు సమన్వయకర్త బలసాని కిరణ్‌కుమార్ పిలుపునిచ్చారు. శనివారం మండలంలోని ఏటుకూరు బైపాస్ రోడ్డులోని నియోజకవర్గ కార్యాలయంలో ముఖ్య నేతల సమావేశం నిర్వహించారు. బలసాని మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంపై, ప్రజలు తీవ్ర స్థాయిలో వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారని తెలిపారు. కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమాన్ని మరిచి కేవలం ధనార్జనే లక్ష్యంగా పనిచేస్తున్న వైనాన్ని వివరించారు. గ్రామ స్థాయిలో కూటమి పార్టీ నేతల అరాచకాలు, అక్రమాలు, అక్రమార్జనలను స్థానిక నేతలతో కలసి చర్చించారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ప్రజలకు అమలు చేయకుండా చేశామని చెప్పుకోవటం శోచనీయమని పేర్కొన్నారు.

టైరు పగిలి హైవేపై ఆటో బోల్తా



ప్రత్తిపాడు: చేపల లోడుతో వెళ్తున్న ఆటో టైరు పగిలి హైవేపై బోల్తా పడిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. గుంటూరు నుంచి శనివారం చిలకలూరిపేట పేట వైపు చేపల లోడుతో వెళ్తున్న ఆటో టైరు ఒక్కసారిగా పగిలిపోవడంతో వాహనం 16వ నంబరు జాతీయ రహదారిపై అదుపు తప్పి, ప్రత్తిపాడు మండలం తుమ్మలపాలెం వద్ద ఆటో బోల్తా కొట్టింది. దీంతో ఆటోలోని పెద్ద వాటర్ ట్యాంక్‌లో ఉన్న చేపలు చెల్లా చెదురుగా కింద పడిపోయాయి. ఈ ప్రమాదంలో డ్రైవర్ కు స్వల్ప గాయాలు అయ్యాయి. కాగా బోల్తా పడిన ఆటోను స్థానికులు పొక్లెయిన్ సాయంతో బయటకు లాగారు. ప్రమాదంపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ప్రత్తిపాడు పోలీసులు తెలిపారు.

గోరంట్లలో ఉచిత ఆయుర్వేద వైద్య శిబిరం



గుంటూరు రూరల్: గోరంట్లలోని శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం(పెద్దగుడి)లో శనివారం శ్రీ వేంకటేశ్వర ఆయుర్వేద వైద్యశాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో ప్రముఖ కేరళ ఆయుర్వేద వైద్య నిపుణుడు డాక్టర్ కొండా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఆయుర్వేద వైద్యం కోసం కేరళ వెళ్లాల్సిన అవసరం లేదని గోరంట్ల గ్రామంలోని ఇన్నర్ రింగ్ రోడ్డులో 120 పడకలతో ఆస్పత్రి ఏర్పాటు చేయటం జరిగిందని వివరించారు. ప్రతి ఒక్కరూ ఈ సౌకర్యాన్ని వినియోగించుకోవచ్చన్నారు. వైద్య శిబిరంలో 300 మందికి పైగా పరీక్షలు నిర్వహించి అర్హులైన వారికి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు అందజనేయులు, వేణుగోపాల్, గజవల్లి శివన్నారాయణ, సతీష్, ఎండీ ఆము, డాక్టర్ భానుకశ్యప్, డాక్టర్ మౌనిక, డాక్టర్ రాహుల్‌చంద్ర, మేనేజర్ మల్లేశ్వరి పాల్గొన్నారు.

ఘనంగా రన్ ఫర్ జీసస్ శాంతి ర్యాలీ



నెహ్రూనగర్: క్రీస్తు పునరుత్థాన్ని పురస్కరించుకుని ప్రపంచ శాంతి కొరకు, దేశ సమైక్యత కొరకు శనివారం గుంటూరు నగరంలోని వివిధ క్రైస్తవ సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన రన్ ఫర్ జీసస్ నిర్వహించడం శుభపరిణామని రన్ ఫర్ జీసస్ కో ఆర్డినేటర్ పాస్టర్ రెవరెండ్ గనుపల్లి సతీష్‌బాబు పేర్కొన్నారు. వెస్ట్ ప్యారిస్ చర్చి నుంచి ప్రారంభమై కంకరగుంట ఫ్లై ఓవర్, లక్ష్మీపురం, లాడ్జిసెంటర్, శంకర్ విలాస్ మీదుగా ఏసీ కాలేజీ వద్ద ముగిసింది. ఈ సందర్భంగా సతీష్‌కుమార్ మాట్లాడుతూ క్రీస్తు పునరుత్థానాన్ని ప్రపంచానికి చాటి చెప్పే విధంగా శాంతి సమానత్వంతో ఎదుటి వారిని ప్రేమించాలన్నారు. క్రీస్తు ప్రేమను క్రియల్లో చూపించే విధంగా క్రైస్తవులు శాంతి సమాధానానికి చిహ్నమని క్రైస్తవులంతా ఐక్యతతో ఉన్నామని చెప్పడానికి ఈ రన్ ఫర్ జీసస్ కార్యక్రమం దోహదపడుతుందని వివరించారు. కార్యక్రమంలో పాస్టర్ మల్లెల రాజు, పాస్టర్ పాల్ మనోహర్, బాబు ఆశీర్వాదం, రత్నప్రసాద్, ఆనంద్‌పాల్, విల్సన్, పరిశుద్ధరావు, డాక్టర్ గోళ్ల మూడి రాజసుందరబాబు, మద్దు ప్రేమజ్యోతి బాబు, క్రైస్తవ విశ్వాసులు పాల్గొన్నారు.

స్వచ్ఛతలో ప్రజలు భాగస్వాములు కావాలి



నిడుబ్రోలు సీహెచ్‌సీలో స్వచ్ఛత కార్యక్రమంలో పాల్గొన్న డాక్టర్ ఫిరోజ్‌ఖాన్



పొన్నూరులో నిర్వహించిన ర్యాలీలో ప్రతిజ్ఞ చేయిస్తున్న కమిషనర్ రమేష్ బాబు



మునిపల్లెలో ఎలక్ట్రానిక్ వ్యర్థాల సేకరణలో పాల్గొన్న ఈఓపీఆర్‌డీ

పొన్నూరు: 'స్వచ్ఛాంధ్ర – స్వర్ణాంధ్ర' కార్యక్రమంలో భాగంగా శనివారం ఈ వేస్ట్ (ఎలక్ట్రానిక్ వ్యర్థాలు) అంశంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు పురపాలక సంఘ కార్యాలయం నుంచి ఐలాండ్ సెంటర్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో ఉన్న వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించి పారిశుద్ధ్య వాహనంలో వేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ల రమేష్ బాబు మాట్లాడుతూ ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేసి స్వచ్ఛ పొన్నూరుకు ప్రజలు సహకారం అందించాలని కోరారు. ఈ వేస్ట్ కార్యక్రమంపై అవగాహన కల్పించి ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ రమేష్, మున్సిపల్ టీపీఓ రఘురాం, డీఈ వెంకయ్య, శానిటరీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, నాయకులు పాల్గొన్నారు.

- నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్ ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర– స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యశాల పరిసరాలను శుభ్రం చేసి, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను తొలగించారు. స్వచ్ఛ పొన్నూరుకు సహకరించాలని అందరూ ప్రతిజ్ఞ చేశారు.
- **మునిపల్లెలో..**

మండల పరిషత్ ఆధ్వర్యంలో మునిపల్లెలో స్వచ్ఛాంధ్ర ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఈఓపీఆర్‌డీ కేఎస్ మల్లికార్జునరావు పాల్గొని ప్రతి ఇల్లు, పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఎలక్ట్రానిక్ వ్యర్థాలను పారిశుద్ధ్య సిబ్బందికి అందజేయాలని తెలిపారు. గ్రామంలో వినియోగంలో లేని ఎలక్ట్రానిక్ వ్యర్థాలను సేకరించారు. ప్లాస్టిక్, ఎలక్ట్రానిక్ వ్యర్థాలను వినియోగించరాదని తెలియజేసి ప్రజలు, సిబ్బందితో ప్రతిజ్ఞ చేయించారు.



స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహిస్తున్న మండలాభివృద్ధి అధికారి రవికుమార్

ప్రత్తిపాడు: గ్రామాల స్వచ్ఛతలో ప్రజలు స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని డెప్యూటీ మండల పరిషత్ అభివృద్ధి అధికారి జి.రవికుమార్ అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా శనివారం నియోజకవర్గ కేంద్రం ప్రత్తిపాడులో ఈ–వేస్ట్ వ్యర్థాల సేకరణ కార్యక్రమాన్ని పంచాయతీ కార్యదర్శి షేక్ ఖాజా ఆధ్వర్యంలో నిర్వహించారు. గృహాల్లో నిరుపయోగంగా ఉన్న విద్యుత్ పరికరాలను గ్రామస్తుల నుంచి సేకరించారు. కార్యక్రమాన్ని జి.రవికుమార్ పరిశీలించారు. ఈ వేస్ట్‌తో పాటు తడి చెత్త, పొడి చెత్తపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ గ్రామాల్లోని సాలిడ్ వేస్ట్ ప్రాసెసింగ్ యూనిట్లను సమర్థంగా వినియోగించేందుకు అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ప్రతి నెల మూడో శనివారం అన్ని గ్రామ పంచాయతీల్లో స్వచ్ఛత కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. కార్యక్రమంలో 12వ వార్డు సభ్యుడు డబ్బూరి వెంకటేశ్వర్లు, స్వచ్ఛ భారత్ మండల కోఆర్డినేటర్ డబ్బూరి శ్రీనివాసరావు, సచివాలయ ఉద్యోగులు, జిల్లా పరిషత్ హైస్కూల్ విద్యార్థులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలి

ప్రత్తిపాడు: పర్యావరణ పరిరక్షణకు ప్రజలు తమ వంతుగా కృషి చేయాలని పెదనందిపాడు ఎంపీడీఓ లక్ష్మీదేవి అన్నారు. స్వర్ణాంధ్ర, స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఈ– వ్యర్థాలపై మండల పరిధిలోని వరగానిలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. స్థానిక పంచాయతీ కార్యాలయం వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయా శాఖల అధికారులు విద్యార్థులు, ప్రజలతో స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఇళ్లు, వ్యాపార సముదాయాల నుండి ఉత్పన్నమయ్యే వ్యర్థాలను ఎక్కడ పడితే అక్కడ పడేయవద్దని సూచించారు. తడిచెత్త, పొడి చెత్తను వేర్వేరుగా పారిశుద్ధ్య సిబ్బందికి అందించడం ద్వారా గ్రామానికి అదనపు ఆదాయాన్ని సమకూర్చుకోవచ్చని చెప్పారు. కార్యక్రమంలో సర్పంచి బి.మేరిమ్మ, ఈఓపీఆర్డీ వర్ధిని, డీటీ కరిముల్లా పాల్గొన్నారు.



పీఏఎస్ కళాశాలలో శుభ్రం చేస్తున్న విద్యార్థులు

పిఏఎస్ కళాశాలలో..

స్థానిక పీఏఎస్ కళాశాలలో ప్రిన్సిపాల్ వీరరాఘవయ్య ఆధ్వర్యంలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. విద్యార్థులు చీపుర్లు పట్టి కళాశాల ప్రాంగణాన్ని పరిశుభ్రం చేశారు. అనంతరం మొక్కలు నాటారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

సర్దార్ గౌతు లచ్చన్నకు ఘన నివాళి

పెదకాకాని: బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ గౌతు లచ్చన్న అని రాష్ట్ర గౌడ సంఘం అధ్యక్షుడు, ప్రముఖ న్యాయవాది వాకా రాంగోపాల్‌గౌడ్ అన్నారు. పెదకాకానిలో సెంటర్‌లో శనివారం స్వాతంత్ర సమరయోధుడు సర్దార్ గౌతులచ్చన్న వర్థంతిని పురస్కరించుకుని పెదకాకాని సెంటర్‌లో సర్దార్ గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమానికి కారంకి లక్ష్మీనారాయణ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా వాకా రాంగోపాల్‌గౌడ్ మాట్లాడుతూ స్వాతంత్రోద్యమంలోనూ, క్విట్ ఇండియా ఉద్యమంలో సర్దార్ గౌతులచ్చన్న ప్రముఖ పాత్ర పోషించారన్నారు. మనదేశంలో సర్దార్ వల్లబాయి పటేల్ తరువాత సర్దార్‌గా పిలువ బడే వ్యక్తి గౌతులచ్చన్న అన్నారు. ప్రకాశం పంతులు, బెజవాడ గోపాలరెడ్డి మంత్రి వర్గంలో మంత్రిగా పనిచేశారన్నారు. ఉప్పు సత్యాగ్రహం, స్వాతంత్ర్య సమరంలో లక్షల మందిని సర్దార్ గౌతు లచ్చన్న నడిపించిన తీరును కొనియాడారు. కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ నాయకులు లింగంగుంట సాల్మన్‌రాజు, గోళ్ళ శ్యాంముఖర్జీబాబు, ఆత్మకూరి వెంకటేశ్వర్లు, క్రోసూరి పూర్ణచంద్రరావు, వుప్పాల శివాజీ, కుక్కల నాగమల్లేశ్వరరావు, పాగోలు రాము, కారంకి వెంకటేశ్వరరావు, పాగోలు శ్రీనివాసరావు, వలివేటి మురళీకృష్ణ, మేడా శివకృష్ణ, కొమ్మూరి మల్లికార్జునరావు పాల్గొన్నారు.



పెదకాకాని సెంటర్‌లో గౌతు లచ్చన్న విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం


12 ఎకరాల మొక్కజొన్న పంట దగ్ధం

కాకుమాను: మొక్కజొన్న పంట దగ్ధమైన ఘటన మండలంలోని కొండపాటూరులో శనివారం చోటుచేసుకుంది. వివరాలు.. గ్రామానికి చెందిన ఓ రైతు తనపొలంలో పంట పూర్తికావడంతో వ్యర్థాలను తగలబెట్టేందుకు నిప్పు పెట్టాడు. ఎండా, గాలి తీవ్రంగా ఉండడంతో మంటలు చుట్టుపక్కల పొలాలకు వ్యాపించి సుమారు 12 ఎకరాలు దగ్ధమైనట్లు సమాచారం.

రైతులు జాగ్రత్తలు పాటించాలి

మండలంలోని మొక్కజొన్న, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు ప్రస్తుతం ఎండలు అధికంగా ఉన్నా నేపథ్యంలో తగిన జాగ్రత్తలు పాటించాలి. పంట పూర్తయిన రైతులు వ్యర్థాలను తొలగించేందుకు నిప్పు పెడొద్దు. పక్క రైతుల పంట కూడా ఇంటికి చేరే వరకు ఎవ్వరు ఇలాంటి పనులు చేయరాదు.

– ఏక్‌నాథ్, ఎస్‌ఐ



దగ్ధమవుతున్న మొక్కజొన్న పంట

మండలాభివృద్ధే ధ్యేయంగా పని చేయాలి

చేబ్రోలు: ప్రజాప్రతినిధులు, అధికారులు మండలాభివృద్ధే ధ్యేయంగా పనిచేయాలని చేబ్రోలు ఎంపీపీ కొక్కిలగడ్డ సాహితి అన్నారు. చేబ్రోలు మండల పరిషత్ కార్యాలయంలో శనివారం సర్వ సభ్య సమావేశం నిర్వహించారు. వేజండ్ల–1 ఎంపీటీసీ షేక్ బాషా మాట్లాడుతూ వేజండ్లలో విద్యుత్ స్తంభాలు గాలి వస్తే పడిపోయే విధంగా అనేక చోట్ల ఉన్నాయని వాటిని మార్చాల్సిన అవసరం ఉందని చెప్పారు. దీనిపై అనేక సార్లు విద్యుత్‌శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఉర్దూ స్కూల్ పక్కన రెండు స్తంభాలు పడిపోయే విధంగా ఉన్నాయన్నారు. ప్రమాదం జరగకముందే జాగ్రత్తలు తీసుకోవాలని ఎంపీటీసీ సూచించారు. జీబీసీ రహదారిపై పలు చోట్ల ఆర్అండ్‌బీ అధికారులు స్పీడ్ బ్రేకర్లు వేశారని వాటిపై పెయింట్ వేసి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని కోరగా నిధులు కొరత కారణంగా జాప్యం జరిగిందని త్వరతగతిన పనులు పూర్తి చేయనున్నట్లు ఆర్ అండ్‌బీ ఏఈ తెలిపారు. వేజండ్లలోని మసీదు పక్కన స్థలం ఆక్రమణలకు గురవుతున్నదని దీనిపై సంబంధిత అధికారులు స్పందించాలని ఎంపీటీసీ సభ్యులు కోరారు. మండల పరిధిలోని గ్రామాల్లో జరుగుతున్న అభివృద్ధి పనులకు సంబంధించి స్థానిక ప్రజా ప్రతినిధులకు తెలియజేయాలని వైస్ ఎంపీపీ పసుపులేటి శ్రీనివాసరావు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏ ఉమాదేవి, వైస్ ఎంపీపీలు పసుపులేటి శ్రీనివాసరావు, కాసు అనిత పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ సాహితి

20 కిలోల గంజాయి స్వాధీనం

లక్ష్మీపురం: చెడు వ్యసనాలకు అలవాటు పడి డబ్బు సంపాదించాలని ముగ్గురు యువకులు కలిసి గంజాయి కొనుగోలు చేసి గుంటూరులో విక్రయిస్తున్న వారిని పట్టాభిపురం సీఐ గంగా వెంకటేశ్వర్లు శనివారం అదుపులో తీసుకున్నారు. సీఐ తెలిపిన వివరాలు.. కోబాల్డ్‌పేట 5వ లైన్‌కు చెందిన షేక్ సమీర్ అమరావతి రోడ్డులో మెకానిక్‌గా పని చేస్తుంటాడు. ఏటీ అగ్రహారానికి చెందిన నాగిపోగు బాలాజీ, కృష్ణబాబు కాలనీకి చెందిన నాగిపోగు శివతో కలిసి నేతాజీ నగర్‌లో రెండు బ్యాగ్‌లతో ఉన్నారు. పోలీసులను చూసి పారి పోతుండగా ముగ్గురిని పట్టుకుని, వారి బ్యాగ్‌లు తనిఖీ చేసినట్లు చెప్పారు. బ్యాగ్‌లో గంజాయి ప్యాకెట్స్ ఉన్నట్లు గుర్తించినట్లు చెప్పారు. ముగ్గురు యువకులను పట్టాభిపురం పోలీస్ స్టేషన్‌కు తరలించి విచారించగా కోబాల్డ్‌పేటకు చెందిన షేక్ సమీర్ అమరావతి రోడ్డులో బైక్ మెకానిక్ షాపు ఉందని, అక్కడకు నిత్యం నాగిపోగు బాలాజీ, నాగిపోగు శివలు వస్తుండేవారని, అలా పరిచయం అయిన ముగ్గురు గంజాయి తాగడం ప్రారంభించారు. దీంతో డబ్బు సంపాదించి జల్సాలు చేయాలనే ఉద్దేశంతో నర్సీపట్నం వెళ్లి గంజాయి కొని తెచ్చుకుని దానిని అధిక ధరకు గుంటూరు నగరంలోని విక్రయించడం ప్రారంభించారు. ఈ విక్రయించేందుకు తెచ్చిన గంజాయిని నేతాజీ నగర్ చెరువు దగ్గరకు వచ్చి ముగ్గురు గంజాయిని పంచుకుంటున్న నేపథ్యంలో 20 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకుని సీజ్ చేసి ముగ్గురిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. కోర్టు వారిని రిమాండ్ విధించినట్లు సీఐ వివరించారు.

ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ వార్షికోత్సవం

గుంటూరు రూరల్: మండలంలోని అడవితక్కెళ్లపాడు గ్రామం పుచ్చలపల్లి సుదరయ్య కాలనీలోని ఎంవీఎస్ కోటేశ్వరరావు మెమోరియల్ స్కూల్ 9వ వార్షికోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా స్కూల్‌లోని కమ్యూనిటీ డిజిటల్ లైబ్రరీని స్వేచ్ఛ స్వచ్ఛంద సంస్థ సహకారంతో ప్రారంభించారు. ఈసందర్భంగా మలినేని గ్రూప్ సంస్థల చైర్మన్ డాక్టర్ మలినేని పెరుమాళ్ళు లైబ్రరీని ప్రారంభించి మాట్లాడుతూ దాతల సహకారంతో నడుస్తున్న ఈ స్కూలు ఎంతో ఆదర్శంగా తీర్చిదిద్దారన్నారు. భవిష్యత్‌లో ఈ స్కూలు అభివృద్ధికి తనవంతు కృషిచేస్తానన్నారు. కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు, శేషగిరిరావు, పెద్దబ్బాయి, సుభాషిణి, కొమ్మాలపాటి శ్రీధర్, పెద్ది సాంబశివరావు, గాంధీ, స్కూల్ ప్రిన్సిపాల్ తాండవ కృష్ణ, వైస్ ప్రిన్సిపాల్ కె.దివ్య, శ్రీపతిరావు పాల్గొన్నారు.



వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న అతిథులు

ఈ-వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం

గుంటూరు మెడికల్: జీజీహెచ్‌లో స్వచ్ఛాంధ్ర–స్వర్ణాంధ్ర కార్యక్రమాన్ని ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్, జీజీహెచ్ సిబ్బంది కలిసి శనివారం నిర్వహించారు. ఈనెల థీమ్ ఈ–వేస్ట్ మేనేజ్మెంట్, ఎలక్ట్రానిక్ వేస్ట్ అంటే ఏమిటి వాటిని, ఎలా డిస్పోస్ చేయాలి, వంటి విషయాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ యశస్వి రమణ మాట్లాడుతూ ఈ – వేస్ట్ మేనేజ్మెంట్ వ్యర్థాల్ని సరైన విధంగా డిస్పోస్ చేయకపోవడం వలన కలుగు నష్టాలు వాటి వలన వస్తున్న ఆరోగ్యపరమైన సమస్యలు, వీటి నుంచి ప్రజలు ఎలా విముక్తి పొందాలి వంటి విషయాలపైన ప్రజలు, విద్యార్థులకు, సిబ్బందికి, అవగాహన కల్పించారు. ప్రభుత్వ స్కూల్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు నాటికలు, ఫ్లాష్ మాబ్ వంటి నృత్య ప్రదర్శనలు, ర్యాలీల ద్వారా అవగాహన కల్పించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ ఎంఓ డాక్టర్ వెంకటసతీష్‌కుమార్ పాల్గొన్నారు.

సమతుల ఆహారంతో ఆరోగ్యం



మాట్లాడుతున్న ఐసీడీఎస్ సూపర్‌వైజర్



పోషకాహారం గురించి వివరిస్తున్న సుజాత దేవి



ర్యాలీని నిర్వహిస్తున్న ఐసీడీఎస్ అధికారులు

ప్రత్తిపాడు: సమతుల ఆహారంతో ఆరోగ్యం లభిస్తుందని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి అన్నారు. పోషకాహార మాసోత్సవాలలో భాగంగా శనివారం మండల పరిధిలోని తిమ్మాపురం, రావిపాటివారిపాలెం గ్రామాలలో గర్భవతులు, మహిళలు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయా సెక్టార్ల సూపర్‌వైజర్లు ఎస్. భారతి, పి.మాధవిలు మహిళలకు సమతుల ఆహారం, చిరుధాన్యాలు, తక్కువ ఖర్చులో ఎక్కువ పోషక విలువలున్న ఆహారాన్ని తయారు చేసుకోవడం ఎలా.. వంటి అంశాలపై అవగాహన కల్పించారు. సూపర్‌వైజర్లు మాట్లాడుతూ మంచి సమతుల ఆహారంతో పాటు పరిసరాల పరిశుభ్రత, వ్యక్తిగత పరిశుభ్రతను ప్రతి ఒక్కరూ పాటించాలన్నారు. సమతుల ఆహారంలో చిరుధాన్యాలు, తృణధాన్యాలు ఉండేలా చూసుకోవాలన్నారు. జంక్ ఫుడ్స్ ఎలాంటి పరిస్థితుల్లోనూ తీసుకోవద్దని వివరించారు. పంచాయతీ కార్యదర్శి సురేష్, అంగన్వాడీ కార్యకర్తలు టి.హేమలత, పి.రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

ఐసీడీఎస్ సూపర్‌వైజర్ ఎస్.భారతి

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి

కొమ్మూరు(కాకుమాను): గర్భిణులు పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సీడీపీఓ సుజాత దేవి అన్నారు. మండలంలోని కొమ్మూరు ఎస్సీ–1 అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా శనివారం గర్భిణులకు, బాలింతలకు పోషకాహారంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా సుజాత దేవి మాట్లాడుతూ పోషకాహారం తీసుకుంటే తల్లీ శిశువు సంపూర్ణ ఆరోగ్యంగా ఉంటారని చెప్పారు. కార్యక్రమంలో కాకుమాను సెక్టార్ సూపర్‌వైజర్ పి.వెంకాయమ్మ పాల్గొన్నారు.

గోర్లవారిపాలెంలో పోషణ్ పక్వాడ వారోత్సవాలు

గుంటూరు రూరల్: మండలంలోని గోర్లవారిపాలెంలో పోషణ్ పక్వాడ వారోత్సవాలను శనివారం నిర్వహించారు. వారోత్సవాలను గ్రామ సర్పంచి నల్లమేకల అప్పమ్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రత్తిపాడు ఐసీడీఎస్ ప్రాజెక్ట్ సూపర్‌వైజర్ ఎంపీ రత్నం మాట్లాడుతూ 1000 రోజుల సంరక్షణ కార్యక్రమంలో భాగంగా స్త్రీలు గర్భం దాల్చిన రోజు నుంచి పుట్టిన బిడ్డకు 2 సంవత్సరాలు వచ్చే వరకూ అందించే పౌష్టికాహారం, రక్షణ కార్యక్రమాలను నిర్వహించటం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీ ఈఓ శ్రీదేవి, ఎంపీపీ స్కూల్ ప్రధానోపాధ్యాయురాలు సుజాత, ఏఎన్ఎం నర్మద, అంగన్‌వాడీ టీచర్లు అనంతలక్ష్మి, పీ సుజాత, వి.అంజలి పాల్గొన్నారు.

రాహుల్‌గాంధీ, సోనియా ఫ్లెక్సీ దహనం

గుంటూరు మెడికల్: స్వాతంత్ర సమరయోధులకు చెందిన భూములు తక్కువ ధరకే తీసుకొని కాంగ్రెస్‌పార్టీ అధికారం అడ్డుపెట్టుకొని అధికార దుర్వినియోగానికి పాల్పడిందని బీజేపీ గుంటూరు జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు మైలా హరికృష్ణ ఆరోపించారు. బీజేపీ యువజన విభాగం గుంటూరు జిల్లా ఆధ్వర్యంలో శనివారం లాడ్జి సెంటర్‌లో నేషనల్ హెరాల్డ్ స్కామ్‌కి సంబంధించి కాంగ్రెస్ పార్టీ పూర్వ అధ్యక్షులు సోనియాగాంధీ, ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన కుంభకోణానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. వారి దిష్టిబొమ్మను దహనం చేశారు. కార్యక్రమంలో బీజేపీ నేతలు పాల్గొన్నారు. కార్యక్రమంలో పార్టీ ప్రధాన కార్యదర్శి చరకా కుమార్ గౌడ్, యువమోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి తుంగ యశ్వంత్, యువమోర్చ నాయకులు తానుచింతల అనిల్, ఉపాధ్యక్షుడు రామిశెట్టి గోపి, బాల కోటయ్య, రామాచార్యులు రాజా, యువమోర్చా కార్యవర్గ సభ్యులు పాలెం రాజశేఖర్, తోకల హరి, వెంకట్, సాయినాథ్ రెడ్డి, సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ప్రవీణ్, యువ మోర్చా మండల అధ్యక్షుడు సాయి రాధాకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

చేబ్రోలు: వేగంగా వచ్చిన రెండు ద్విచక్ర వాహనాలు ప్రమాదవశాత్తూ ఢీ కొనటంతో తండ్రీ కూతుళ్లకు గాయాలైన ఘటన చేబ్రోలు మండలం వడ్లమూడి గరువుపాలెంలో శనివారం రాత్రి చోటుచేసుకుంది. తెనాలి నుంచి బైక్‌పై గుంటూరుకు తండ్రీ కూతుళ్లు రాంబహదూర్, అంజలి వస్తున్నారు. వడ్లమూడి గరువుపాలెం నర్సరీల ప్రాంతం వద్ద ఎదురుగా వచ్చిన బుల్లెట్ వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ఘటనలో బుల్లెట్‌పై ఉన్న వ్యక్తికి స్వల్ప గాయాలయ్యాయి. తెనాలి నుంచి గుంటూరుకు వస్తున్న రాంబహదూర్ గుంటూరు సంగడిగుంటలోని శ్రీ చైతన్య కళాశాలలో వాచ్‌మెన్‌గా పనిచేస్తున్నాడు. బైక్‌పై వస్తున్న రాంబహదూర్‌తో పాటు అతడి కూతురు అంజలికి కాళ్లకు గాయలయ్యాయి. 108లో గుంటూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. చేబ్రోలు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలి

ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అజయ్‌కుమార్



ప్రత్తిపాడు: కూటమి ప్రభుత్వం వెంటనే అన్నదాత సుఖీభవ పథకాన్ని అమలు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.అజయ్‌కుమార్ డిమాండ్ చేశారు. మండల కేంద్రం పెదనందిపాడులోని తేళ్ల నారాయణ విజ్ఞాన కేంద్రంలో శనివారం రైతు సంఘం మండల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన అజయ్‌కుమార్ మాట్లాడుతూ నల్లమడ వాగు ముంపు వలన ఏటా వేల ఎకరాలు ముంపు బారిన పడి పంట దెబ్బతింటుందని చెప్పారు. రైతులను ఆదుకునేందుకు, గిట్టుబాటు ధరలు కల్పించేందుకు ధరల స్థిరీకరణ నిధికి రూ.ఐదు వేల కోట్లు కేటాయించాలని కోరారు. కార్యక్రమంలో రైతు సంఘ నాయకులు డి.రమేష్‌బాబు, కె.వెంకటశివరావు, పి.సుధీర్ పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన



పొన్నూరు: వైద్యశాలల్లో పనితో పాటు భద్రతకు కూడా అధిక ప్రాధాన్యం ఇవ్వాలని అగ్నిమాపక కేంద్రం అధికారి కె.ప్రసాదరావు అన్నారు. అగ్ని మాపక వారోత్సవాల్లో భాగంగా శనివారం నిడుబ్రోలు సామాజిక ఆరోగ్య కేంద్రంలో అగ్ని ప్రమాదాల నియంత్రణపై అవగాహన కల్పించారు. ప్రమాదాలు జరిగితే ఎలా నివారించాలో మాక్ డ్రిల్ చేసి చూపించారు. కార్యక్రమంలో ఆరోగ్య కేంద్రం సూపరింటెండెంట్ డాక్టర్ ఫిరోజ్ ఖాన్, వైద్య, అగ్నిమాపక సిబ్బంది పాల్గొన్నారు.